సాక్షి తిరుపతి
శుక్రవారం । 6 । జూన్ । 2025



రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

నాయుడుపేట మండలంలో ఇసుక, మట్టి మాఫియా రెచ్చిపోతోంది. విచ్చలవిడిగా తరలించి సొమ్ము చేసుకుంటోంది. - 10లో



కాలేజీల పేరుతో కోచింగ్ సెంటర్లు

కాలేజీల పేరుతో అక్రమంగా కోచింగ్ సెంటర్లు నడుపుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. - 10లో



ఘనంగా ఖరీఫ్ విత్తన దినోత్సవం

ఎన్జీరంగా వర్సిటీ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఖరీఫ్ విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. - 10లో

న్యూస్‌రీల్

రాయితీపై డ్రోన్ పంపిణీ



డ్రోన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: పురుగు మందుల పిచికారీకి డ్రోన్లు అత్యుత్తమమని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం శ్రీకాళహస్తిలోని ఏడీఏ కార్యాలయంలో పార్లపల్లికి చెందిన రైతు దామోదర్‌కు రాయితీపై డ్రోన్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి, వేరుశనగ, మిరప పంటలకు ఎకరాకు డ్రోన్ ద్వారా ఐదు నిమిషాల్లో పురుగు మందులను పిచికారీ చేయొచ్చని చెప్పారు. వర్షాలు పడినప్పుడు బురదలో మందులను పిచికారీ చేయడం కష్టంగా ఉంటుందని, అదే డ్రోన్ ద్వారా మరింత సులభంగా పిచికారీ చేయొచ్చని చెప్పారు. రాయితీ డ్రోన్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఓ భారతి పాల్గొన్నారు.

24 నుంచి ఎంసీఏ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 3 వరకు జరగాల్సిన ఎంసీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్‌ను ఎగ్జామినేషన్ డీన్ ప్రొఫెసర్ కే సురేంద్రబాబు గురువారం విడుదల చేశారు. వాయిదా పడిన పరీక్షలను ఈ నెల 24వ తేదీ నుంచి 30వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలకు సమాచారం అందించామని, మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

డీఎస్సీకి పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: డీఎస్సీ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి వర్చువల్ పద్ధతిలో డీఎస్సీ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో డీఎస్సీ పరీక్షలు ఉంటాయన్నారు. తిరుపతిలో 8 సెంటర్లలో 33,607 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని చెప్పారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. దివ్యాంగులకు 50 నిమిషాలు అదనంగా సమయం ఇస్తారని చెప్పారు. పరీక్ష కేంద్రానికి ప్రతి ఒక్కరూ 15 నిమిషాలు ముందే రావాల్సి ఉంటుందని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి ఉండదని ఆయన స్పష్టం చేశారు. హాల్‌టిక్కెట్‌తోపాటు పాస్‌ఫొటో సైజ్ ఫొటో ఒకటి, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్, అదనపు ఎస్పీ శ్రీనివాసులు, డీఎంఅండ్‌హెచ్ఓ బాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ డిస్మిస్

తిరుపతి క్రైమ్: తిరుపతిలో సంచలనం రేపిన డ్రగ్స్ కేసులో మరో హెడ్‌కానిస్టేబుల్‌ని డిస్మిస్ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన్ రాజు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణలో డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడైన తిరుపతి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పీ.రామచంద్ర (1425) ను పూర్తి స్థాయిలో విధుల నుంచి తొలగించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే.. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తెలిపారు.

గ్రౌండ్ రిపోర్ట్

బాబు గారడీ!

నాడు

జగనన్న పాలన స్వర్ణయుగం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా నిలిచారు. ఇచ్చిన మాటప్రకారం ప్రతి పథకాన్నీ అమలు చేశారు. ఏడాదిలో నవరత్నాలను అమలు చేసి ప్రతి పేద మహిళకు ఆర్థిక భరోసా కల్పించారు. అమ్మ ఒడి, ఆసరా, చేయూత పథకాలు మా ఇంటి ఆర్థిక పరిస్థితిని మార్చేశాయి. ఆ రోజులు స్వర్ణయుగాన్ని తలపించాయి. మళ్లీ రావాలని ఎదురు చూస్తున్నా. – సుబ్బులక్ష్మమ్మ, వంటమాస్టర్, తిరుపతి

నేడు

ఏడాదిగా పథకాల ప్రస్తావనే లేదు



కూటమి ప్రభుత్వం ఏదో చేస్తుందని కలలు కన్నాం. సూపర్ సిక్స్ పథకాలు అమలైతే ఆర్థికంగా కొంత ఊరట లభిస్తుందని ఆశించాం. డబ్బు లేదు. సంపద సృష్టించి తర్వాత చూద్దాం.. అంటూ సీఎం చంద్రబాబు వెటకారంగా మాట్లాడటం బాధనిపిస్తోంది. మేనిఫెస్టోలో పెట్టి పథకాలను పరుగులు పెట్టిస్తామని నమ్మించి అధికారం చేపట్టిన తర్వాత వాటి ప్రస్తావన ఎత్తకపోవడం దారుణం. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించ లేదు. – కళావతి, గృహిణి, గూడూరు



కూటమి ప్రభుత్వంలో అమలుకాని ఎన్నికల హామీలు

- ఏడాదవుతున్నా కనిపించని సంక్షేమ పథకాలు
- ఆర్థిక స్థితిపై సాకులు చెప్పి ఎగ్గొడుతున్న వైనం
- సంపద సృష్టి ఎలానో చెప్పాలంటూ ప్రజలతో వెటకారం
- వైఎస్సార్‌సీపీ పాలనలో ఏడాదిలోనే 90 శాతం హామీలు అమలు
- బేరీజు వేసుకుంటున్న జనం

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కింది. ఏడాది గడుస్తున్నా ఒక్క హామీనీ సక్రమంగా నిర్వహించక నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోంది. సూపర్ సిక్స్ అంటూ జబ్బలు చరిచి ఇప్పుడు బీద అరుపులు అరవడం విమర్శలకు తావిస్తోంది. అదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోపే 90 శాతంపైగా హామీలు అమలు చేసి ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచింది. మేనిఫెస్టోను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పవిత్ర గ్రంథంగా భావించారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించి ఆదర్శంగా నిలిచారు.

అబద్ధపు హామీలు.. గారడీ మాటల్లో సీఎం చంద్రబాబు ఆరితేరిపోయారు. అధికారం కోసం నోటికొచ్చిన హామీలివ్వడం.. అధికారంలోకి రాగానే నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచడం ఆయనకు అలవాటైపోయింది. గత ఎన్నికల్లో సూపర్ సిక్స్.. బాబు ష్యూరిటీ..భవిష్యత్ గ్యారంటీ అంటూ ఊదరగొట్టి చేతులు పైకెత్తేశారు. ఏడాది గడిచినా ఇంతవరకు ఒక్క హామీనీ అమలు చేయక నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారు. రైతులు, నిరుద్యోగులు, చివరకు మహిళలనూ వెన్నుపోటు పొడుస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. ఎదురు తిరిగిన వారిపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష నాయకులనే టార్గెట్ చేసి కుట్రలకు తెరలేపుతున్నారు. అక్రమ కేసులు బనాయిస్తూ జైలుకు తరలిస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్నారు. హామీలు గాలికొదిలి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై జిల్లా ప్రజలు రగిలిపోతున్నారు. గత ప్రభుత్వంలో తమకందిన సంక్షేమాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

ఒకే ఒక్కడు

జగనన్న ఏడాది పాలనలో జిల్లాలో కల్పించిన ఉద్యోగాలు

సచివాలయ ఉద్యోగాలు	6,010
వలంటీర్లు	11,938
అన్ని ప్రభుత్వ శాఖలలో(శాశ్వత, తాత్కాలిక)	10,257
విద్యావైద్య రంగంలో	8,752
పారిశ్రామిక రంగంలో	18,450
సేవారంగాలలో	3,590
52 జాబ్ మేళాల ద్వారా	33,740



తిరుపతిలో ఇళ్ల పట్టాలు అందుకున్న ఆనందంలో సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు(ఫైల్)

జగనన్న పాలనలో ఏడాదిలో జిల్లా ప్రజలకు అందిన పథకాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	(మొత్తం కోట్లలో)
రైతుభరోసా	2,90,467	392.13
ఇన్‌పుట్ సబ్సిడీ	1,87,250	201.34
వైఎస్సార్ ఆసరా	3,32,276	944.55
వైఎస్సార్ సున్నా వడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	3,36,998	60.90
వైఎస్సార్ కాపు నేస్తం	1,21,085	145.30
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	1,00,102	201.29
జగనన్న తోడు	55,327	55.32
వైఎస్సార్ చేయూత	1,51,750	227.624
జగనన్న చేదోడు	1,32,082	188.06
నవరత్నాలు..పేదలందరికీ ఇళ్లు	2,57,664	6441.60
వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా	87,457	65.78
అమ్మ ఒడి	2,57,556	1799.78

ప్రజలు అధికారం ఇచ్చారని గర్వపడ లేదు. ఆర్థిక పరిస్థితి బాగోలేదని కుంటి సాకులు చెప్పలేదు. అండగా నిలబడిన ప్రజలను వంచించి వెన్నుపోటు పొడవ లేదు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి తాను ఇచ్చిన హామీలలో 90 శాతం వరకు ఏడాదిలోపే ప్రజలకు అందజేసి ప్రశంసలు అందుకున్న ఏకైక సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించాడు. నవరత్నాలను ప్రవేశపెట్టి కుటుంబంలో ప్రతి మహిళ పేరు మీదనే సంక్షేమ పథకాలు అందించారు. జిల్లాలో 9.25 లక్షల మంది మహిళలకు అమ్మఒడి, ఆసరా, సున్నావడ్డీ, చేయూత, చేదోడు, వసతి దీవెన, విద్యాదీవెన వంటి ప్రధాన పథకాల ద్వారా రూ.8వేల కోట్లకు పైగా ఏడాదిలోనే అందించారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.13,500, ఆర్బీకేలను నిర్మించి పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించి రైతు పక్షపాతిగా నిలిచారు. వార్డు, గ్రామ సచివాలయాలను నిర్మించి ఏడాది తిరగకముందే సుమారు 20వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలను అందించారు. ఇల్లు లేని నిరుపేదలకు తొలి ఏడాదిలోని 5 లక్షల మందికి ఇంటి పట్టాలు అందజేశారు. ఏడాదిలో తాను ఏమి చేశానో ప్రతి వ్యక్తికీ తెలియాలనే ఉద్దేశంతో జిల్లాలోని ప్రతి కుటుంబానికీ అందిన పథకాల వివరాలతో ప్రత్యేక బుక్‌లెట్‌ను గడప గడపకు అందించారు. ధ్రువపత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్ల సహాయంతో ఇంటి వద్దకే సుమారు 250 సేవలను అందించారు. మాట ఇస్తే మడమ తిప్పని వ్యక్తిగా జిల్లా ప్రజల మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

అర్హతే ప్రామాణికం



జగనన్న పాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందించారు. పార్టీలు, మతాలు, వర్గాలు, కులాలు చూడలేదు. మేము ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ ఉండేవాళ్లం. జగనన్న పథకాలతో కాస్త ఊపిరిపీల్చుకున్నాం. రైతు భరోసాతో పాటు, ఆసరా, కాపు నేస్తం, అమ్మ ఒడి పథకాలు అందాయి. ఏడాదిలోపే అన్ని పథకాలను అందించారు. ఇప్పుడు ఆ పథకాల ఊసేలేదు. – రాజేంద్ర, రైతు, శ్రీకాళహస్తి

పేదరికం దూరమైంది



జగనన్న పాలనలో ప్రతి పేద వాడికి పథకాలు అందాయి. ఆర్థికంగా అప్పటికే చితికిపోయి కడు దీనస్థితిలో ఉన్న పేదవాడు మూడు పూటలా అన్నం తిన్నాడు. బతకగలమనే నమ్మకం కలిగించాడు. ఆయన పుణ్యంతోనే మా డీకేటీ భూములకు పట్టాలొచ్చాయి. ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా నగదు జమ అవుతుండేది. మా ఇంటో మా పిల్లలకు అమ్మ ఒడి అందించారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌తో పెద్ద పాప ఇంజినీరింగ్ పూర్తి చేసింది. – రామసుబ్బారెడ్డి, ప్రైవేటు కంపెనీ ఉద్యోగి, తిరుపతి రూరల్

రెడ్‌బుక్ రాజ్యాంగం.. అటకెక్కిన సంక్షేమం

ఏడాది కూటమి పాలనలో రోడ్డున పడ్డ పేదలు

తొలగించిన పింఛన్‌లు	12,005
భవననిర్మాణ కార్మికులు	25,457
తొలగించిన ఉద్యోగులు	13,498
తొలగించిన వలంటీర్లు	11,938
ఉచిత ఇసుక అమలుకాక రోడ్డున పడ్డ కార్మికులు	37,754
నెల ఒకటో తారీఖున వేతనాలు అందని ఉద్యోగులు	85, 435



కూటమి ఏడాది పాలనలో సంక్షేమాన్ని విస్మరించి.. అభివృద్ధిని అటకెక్కించేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా 143 హామీలను మేనిఫెస్టోలో చేర్చి ప్రజలను నమ్మించారు. అధికారం చేపట్టిన మరుక్షణం నుంచి ఆర్థిక స్థితి బాగోలేదంటూ మేనిఫెస్టోను బుట్టదాఖలు చేశారు. అభివృద్ధిని అటకెక్కించి సంక్షేమ పథకాలను గాలికొదిలేశారు. మేనిఫెస్టోలో ప్రధానంగా తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు వంటి పథకాలను నీరుగార్చారు. ఏటా 4 లక్షల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఐదేళ్లలో 20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలంటూ నిరుద్యోగులను నట్టేట ముంచేశారు. ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేలు భృతి, 50 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికీ పింఛన్లు అందిస్తామంటూ ఊదరగొట్టిన బాబు అండ్ కో నోరుమెదపడం లేదు. ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన వంటి పథకాలకు మంగళం పాడేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఆలయాల్లో పనిచేసే ప్రతి అర్చకునికీ నెలకు రూ.15వేలు అంటూ హామీ ఇచ్చి చేతులు పైకెత్తేశారు. అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం మేనిఫెస్టోకే పరిమితం చేశారు. పింఛన్లు పెంచి అందిస్తున్నామంటూ.. జిల్లాలో 12 వేల మంది వృద్ధులు, వితంతువుల పింఛన్లను తొలగించి వారి కడుపుకొట్టారు. కొత్త పింఛన్, రేషన్ కార్డుల ఊసెత్తకుండా దొంగ ఎత్తులు వేస్తున్నారు. దీపం పథకం జిల్లాలో కనీసం 30శాతం మందికి కూడా అందించిన దాఖలాలు లేవు.

కూటమి ఏడాది పాలనలో అందాల్సిన పథకాలు

పథకం	అందినవి	లబ్ధిదారులు
తల్లికి వందనం	నిల్	5,27,356
అన్నదాత సుఖీభవ	నిల్	2,92,039
ఆడబిడ్డ నిధి	నిల్	10,32,457
మహిళలకు ఉచిత బస్సు	నిల్	9,57,909
నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం	నిల్	5,21,081
ప్రభుత్వ ఉద్యోగాలు	నిల్	6,54,762
నిరుద్యోగికి భృతి	నిల్	8,34,765
జాబ్ క్యాలెండర్	నిల్	6,54,762
కొత్త పింఛన్లు	నిల్	57,564
దీపం పథకం	30శాతం	47,455
కొత్త రేషన్ కార్డులు	నిల్	75,308
అర్చకులకు వేతనం	నిల్	6,764

4 లక్షల ఉద్యోగాల ఊసేలేదు



కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాకా ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. 2024లో ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ ఉద్యోగానికి నోటిఫికేషన్ విడుదల చేయలేదు. తొలి సంతకం చేసిన డీఎస్సీకి ఈ ఏడాది తూతూమంత్రంగా నోటిఫికేషన్ ఇచ్చారు. అంతేతప్ప ఒరిగింది ఏమీలేదు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఊసే ఎత్తడం లేదు. – కుమార్‌రెడ్డి, పీజీ విద్యార్థి, తిరుపతి

చేతిలో చిల్లి గవ్వలేదు



గత ప్రభుత్వంలో మహిళల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా డబ్బులు జమచేసేవారు. ప్రస్తుతం పథకాలు లేవు. మాలాంటి పేదల చేతుల్లో చిల్లిగవ్వ లేదు. పాఠశాలలు ప్రారంభిస్తున్నారు. పిల్లల అవసరాలకు, ఫీజులకు అప్పుల చేయాల్సిన పరిస్థితి. తల్లికి వందనం ఇదిగో అదిగో అంటున్నారు. ఏడాదిగా ఇవ్వ లేదు. పేదలు ఎటూ పాలుపోని స్థితిలో దుర్భర జీవితం అనుభవిస్తున్నారు. – రెడ్డెమ్మ, దినసరి కూలి, తిరుపతి

ఘనంగా పర్యావరణ దినోత్సవం



శ్రీసిటీలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఉద్యోగులు



మోండలెజ్ సోలార్ ప్లాంట్ ప్రారంభోత్సవం

- 6వ విడత మియావాకి మొక్కల పెంపకానికి శ్రీకారం
- మొండెలెజ్, బెర్జిన్ పైపుల పరిశ్రమల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు

శ్రీసిటీ (వరదయ్యపాలెం):శ్రీసిటీలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తిరుపతి జోనల్ కార్యాలయ సీనియర్ పర్యావరణ ఇంజినీర్ ఎస్ఎస్ మురళి ముఖ్యఅతిథిగా విచ్చేసి, స్థానిక ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో తలపెట్టిన 'మియావాకి' మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

'మియావాకి' ప్లాంటేషన్‌కు..

శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థ ఆవశ్యకతను ప్రస్తావించారు. 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్' (3ఆర్) విధానం పర్యావరణ పరిరక్షణకు ఎంతో అనువైనదన్న ఆయన, శ్రీసిటీలో సుస్థిరత, కాలుష్య నివారణ, వ్యర్థ పదార్థాల నిర్వహణకు పైవిధానాన్నే అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'గ్రీన్–క్లీన్' ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీసిటీ ఉద్యానవన విభాగ అధికారి మధుసూదనరెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీలో ఇప్పటి వరకు 10 లక్షలకు పైగా మొక్కల పెంపకం చేపట్టామన్నారు. ఏపీ పీసీబీ పర్యావరణ ఇంజినీర్ సుధీర్, శ్రీసిటీ పర్యావరణ ఇంజినీర్ డాక్టర్ వెంకట్, సత్యవేడు అటవీశాఖ సిబ్బంది, శ్రీసిటీ, నోవా ఎయిర్, బాంబే కోటింగ్, సుంద్రం ఫాస్టనెర్స్, పానాసోనిక్ (తడ) తదితర పరిశ్రమల ఉద్యోగులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటు

శ్రీసిటీ పర్యావరణహిత చర్యలకు మరింత ఊతమిస్తూ శ్రీసిటీలోని మోండలెజ్, బెర్జిన్ పైప్స్ పరిశ్రమలు తమ ఉత్పత్తి కేంద్రాల్లో నూతనంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశాయి. మోండలెజ్ స్థాపించిన 6.2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ప్రస్తుతం శ్రీసిటీలో పరిశ్రమలకు సంబంధించి అతి పెద్దది కాగా, బెర్జిన్ పైప్స్ సంస్థ రెండో దశ విస్తరణలో భాగంగా 350 కిలోవాట్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో కలసి, మోండలెజ్‌లో ఆ సంస్థ సప్లై చైన్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ వేనేపల్లి, బెర్జిన్ సోలార్ యూనిట్‌ను హిల్ – స్మిత్ హోల్డింగ్స్ సీఈఓ రట్జర్ ఆల్బర్ట్ లాంచనంగా ప్రారంభించారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 78,288 మంది స్వామిని దర్శించుకున్నారు. 32,079 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

రేపటి నుంచి అమ్మవారి తెప్పోత్సవాలు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలను శనివారం నుంచి 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీ అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమ పూజలు అందుకుని భక్తులను అనుగ్రహించనున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు తెప్పోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

తెప్పోత్సవాల వివరాలు

శనివారం మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు శ్రీసుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తూ భక్తులకు అనుగ్రహించనున్నారు.

ఆర్జితసేవలు రద్దు

తెప్పోత్సవాల కారణంగా తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్ సేవను రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

నేడు ఎస్జీటీలకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఈనెల 6 వ తేదీన ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్జీటీలు, పీఈటీలకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో మొదటగా సీనియారిటీ జాబితా ప్రకారం 1:3 ప్రాతిపదికన సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. సంబంధిత టీచర్లు శుక్రవారం చిత్తూరులోని డీఈవో కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలకు సర్టిఫికెట్ల పరిశీలనకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. పరిశీలన అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగోన్నతులు కల్పిస్తారని డీఈవో పేర్కొన్నారు.

క్లుప్తంగా

కబ్జాకోరులు.. ఎమ్మెల్యే అనుచరులు



మాట్లాడుతున్న బాధితుడు మావిళ్లయ్య

తిరుపతి కల్చరల్: తనకు వంశపారంపర్యంగా సంక్రమించిన భూమిని కొందరు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మావిళ్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవీబీపురం మండలం, రాయపేడు గ్రామ లెక్క దాఖలా సర్వే నం.164/15లో 48 సెంట్లు భూమి ఉందని, ఆ భూమిని ఎమ్మెల్యే ఆదిమూలం అనుచరులు జాన్సన్, చటర్జీ, శరత్‌కుమార్, బనవయ్య, దొరస్వామి, ఏలుమలై రికార్డులు తారుమారు చేసి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. తనకు వంశపారంపర్యంగా వచ్చిన భూమిని కాపాడుకునేందుకు 2018 నుంచి పోరాటం చేయాల్సిన దుస్థితి వచ్చిందని వాపోయారు. తనకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులు, పోలీసులకు విజ్ఞప్తి చేసినా స్పందించడం లేదని ఆరోపించారు.

కాలేజీల పేరుతో కోచింగ్ సెంటర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రైవేట్ ఇంటర్ కళాశాలల ముసుగులో నగరంలోని కొన్ని సంస్థలు అక్రమంగా కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నాయని, వీటికి అడ్డుకట్ట వేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం ఆర్‌ఐఓ రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్‌కు శిక్షణ ఇస్తూ ఒక్కో విద్యార్థి నుంచి రూ.3 లక్షలకు పైగా దండుకుంటున్నారని, చివరి మూడు నెలలు ఉన్నప్పుడు ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. రాజు జూనియర్ కళాశాల పేరుతో ఇంటర్ తరగతులను కాకుండా ఆన్‌లైన్ మెడికల్ కోచింగ్ సెంటర్‌తో కుమ్మక్కై కోచింగ్ సెంటర్‌ను నడుపుతోందని, అలాగే అన్ అకాడమీ, ఆకాష్ వంటి సంస్థలు కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి పాల్గొన్నారు.

- తిరుపతికి చెందిన నవీన్‌కు ఈనెల 9వ తేదీన జరగనున్న స్కూల్ అసిస్టెంట్ పరీక్ష నెల్లూరులోనూ, 13వ తేదీన ఎస్జీటీ పరీక్ష అన్నమయ్య జిల్లాలోనూ కేటాయించారు. తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటూ బతుకులీడుస్తున్నారు. రెండు పరీక్షలకు హాజరు కావాలంటే తిరుపతి నుంచి ముందురోజు ఆయా పట్టణాలకు చేరుకుని హోటల్‌లో బస చేయాల్సి ఉంటుంది. హోటల్ ఖర్చు, భోజనం, చార్జీలు కలిపి కనీసం రూ.7వేల వరకు ఖర్చవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- రేణిగుంటకు చెందిన ఓ మహిళా అభ్యర్థికి ఎస్జీటీ పరీక్షా కేంద్రాన్ని చెన్నై సమీపంలోని చెంగల్‌పట్టులోనూ, స్కూల్‌అసిస్టెంట్ పరీక్ష మదనపల్లిలో కేటాయించారు. ఆమెతో పాటు తల్లిదండ్రులు ఒక రోజు ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. కనీసం ఇద్దరికి చార్జీలు, భోజనం, వసతి కలిపి రూ.10వేల వరకు ఖర్చవుతాయని బాధపడుతున్నారు.



సహనానికి పరీక్ష

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

- అస్తవ్యస్తంగా పరీక్ష కేంద్రాల కేటాయింపు
- జిల్లా వాసులకు సుదూర ప్రాంతాలలో పరీక్ష కేంద్రాలు
- ఒక్కో అభ్యర్థి రూ.5వేల నుంచి రూ.10వేలు ఖర్చు చేయాల్సిందే

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల సహనానికి పరీక్ష పెట్టింది. మెగా డీఎస్సీ అంటూ ప్రగల్భాలు పలికి తూతూమంత్రంగా పోస్టులను భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునేందుకు వందల షరతులు పెట్టి వేధించింది. పరీక్షలకు కనీసం 90 రోజులు సమయం కేటాయించాల్సి ఉండగా కేవలం 45 రోజులే కేటాయించింది. ఇది చాలదన్నట్టు పరీక్ష కేంద్రాలను సైతం రాష్ట్ర సరిహద్దును దాటించింది. చాలా మందికి తిరుపతి జిల్లా కాకుండా చెన్నై, చెంగల్‌పట్టు, పలమనేరు, కర్నూల్, అన్నమయ్య జిల్లా, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో పరీక్షా కేంద్రాలను కేటాయించింది. తిరుపతి జిల్లా నుంచి సుమారు 7వేల మందికి ఇతర జిల్లా, రాష్ట్రాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కేటాయించారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ రెండు పరీక్షలకు వేర్వేరు ప్రాంతాలలో పరీక్షా కేటాయించడంతో అభ్యర్థులకు అవస్థలు తప్పడంలేదు. సుదూర ప్రాంతాలు కావడంతో పరీక్ష రోజు కంటే ఒక రోజు ముందే చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పోనురానూ బస్సు, ట్రైన్ చార్జీలతో పాటు ఒక రోజు ఆ పట్టణంలోని హోటల్‌లో స్టే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రెండు పరీక్షలకుగాను కనీసం రూ.10వేలు ఖర్చవుతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు.

ప్రణాళిక లేకుండా పరీక్షా కేంద్రాల కేటాయింపు



ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో అభ్యర్థులకు నరకం చూపిస్తోంది. పరీక్షా కేంద్రాల కేటాయింపు అస్తవ్యస్తంగా ఉంది. తిరుపతి వాసులకు చెన్నై, హైదరాబాద్, కర్నూల్, కడప జిల్లాలో పరీక్షా కేంద్రాలను కేటాయించారు. పేద అభ్యర్థులు వేలల్లో ఖర్చుపెట్టుకోవాలంటే సాధ్యమేనా?. – డాక్టర్ బీ.ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతి

పేదల పరిస్థితి దారుణం



డీఎస్సీ నోటిఫికేషన్ నుంచి పరీక్షా కేంద్రాల కేటాయింపు వరకు అభ్యర్థులను కూటమి ప్రభుత్వం అయోమయంలోకి నెట్టింది. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పరీక్షలకు సన్నద్ధమైన అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలను ఇతర జిల్లాల్లో, రాష్ట్రాల సరిహద్దులు దాటించడం బాధాకరం. ఒక్కో అభ్యర్థికి కనీసం రూ.5వేలు ఖర్చు అవుతుంది.
–శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్, జాతీయ కార్యదర్శి

మహిళా అభ్యర్థులకు మరిన్ని అవస్థలు



డీఎస్సీ పరీక్షా కేంద్రాల కేటాయింపులో ప్రభుత్వం అభ్యర్థులను కన్ఫ్యూజన్‌కు గురిచేసింది. జిల్లాలోని అభ్యర్థులకు స్థానికంగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో కష్టపడి చదివిన అభ్యర్థులు అప్పులు చేసి పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిళా అభ్యర్థుల పరిస్థితి వర్ణనాతీతం. – శివశంకర్ నాయక్, జీఎస్ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, తిరుపతి

నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం



మెగా డీఎస్సీ రాయాలంటే ఖర్చు భారీగా పెట్టుకోవాల్సిందేనా. పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలంటే రెండు రోజులు సమయం పట్టేలా కేటాయించారు. తిరుపతి జిల్లా వాసులను రాష్ట్ర సరిహద్దులను దాటించారు. మహిళా అభ్యర్థులు సుదూర ప్రాంతాలకు చేరుకోవాలంటే కచ్చితంగా సహాయకులుగా తల్లిదండ్రులు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఇద్దరికీ సుమారు.10 వేలు ఖర్చవుతుంది.
– ఆషా, పీడీఎస్ఓ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ముక్కంటి సేవలో డీజీపీ కుటుంబ సభ్యులు



ఆలయం వద్ద డీజీపీ హరీష్‌గుప్తా కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని రాష్ట్ర డీజీపీ హరీష్‌గుప్తా కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదలు అందజేశారు.

ముక్కంటి సేవలో గవర్నర్ కార్యదర్శి



ఆలయం వద్ద గవర్నర్ కార్యదర్శి

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి డాక్టర్ హరిజవలాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం కావాలి



వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటుతున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : భావితరాల భవిష్యత్తుతోపాటు పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్టూడెంట్స్ వెల్ఫేర్ కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో ఎస్వీయూలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత, ఉద్యోగులు ప్రతిన బూనాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య దామోదరం, ఆచార్య లక్ష్మమ్మ, ఆచార్య ప్రయాగ, ఆచార్య జయచంద్ర, డాక్టర్ పత్తిపాటి వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ న్యాయ సలహాదారుల నియామకం



డీ.శ్రీకాంత్, న్యాయవాది, తిరుపతి



గుండె కాయల బాబు, న్యాయవాది

తిరుపతి లీగల్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్) న్యాయ సలహాదారులుగా తిరుపతి న్యాయవాదులు డీ.శ్రీకాంత్, గుండెకాయల బాబును నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు వారు పేర్కొన్నారు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తరఫున వీరు కోర్టులలో వాదించనున్నారు. న్యాయవాది శ్రీకాంత్ 2001 నుంచి తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. దివంగత సీనియర్ న్యాయవాది పీవీ. శ్రీనివాస దేవర్ వద్ద జూనియర్ న్యాయవాదిగా పనిచేశారు. ప్రస్తుతం ఈఎస్ఐ సంస్థ న్యాయ సలహాదారుగా, ఇతర ప్రైవేటు సంస్థలకు న్యాయ సలహాదారుగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే న్యాయవాది గుండె కాయల బాబు 25 ఏళ్లకు పైగా తిరుపతిలో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలావుండగా వీరి పదవీ కాలం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2028 మార్చి 31 వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు.

కేసుల విచారణ వేగవంతం చేయండి



తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసిన ఆయన పలు కేసుల్లో దర్యాప్తు పెండింగులో వున్న కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 16 అంశాలతో కూడిన బోర్డును పరిశీలించారు. బోర్డుపైన ఉన్న కేసుల్లో పురోగతి లేదని కేసుల విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. పాత కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని, వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం అక్కడే ఉన్న కొందరు బాధితులతో మాట్లాడిన ఎస్పీ.. బాధితులు చెప్పిన విషయాలను పూర్తిగా విని న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రెచ్చిపోతున్న ఇసుక, మట్టి మాఫియా



మేనకూరు వద్ద మామాడి కాలువలో ఇసుక, మట్టి తవ్వుతున్న జేసీబీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలంలో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా ఇసుక, మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే మేనకూరు సెజ్ పరిధిలోని మామాడి కాలువలో జేసీబీలతో ఇసుక, మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా పరిశ్రమలు, ప్రైవేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మామిడి కాలువను కాపాడాలని కోరుతున్నారు. ఈ విషయమై గూడూరు డివిజన్ ఇరిగేషన్ డీఈ విశ్వనాథంను వివరణ కోరగా మామిడి కాలువలో ఇసుక తరలింపునకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఏఈని పంపించి చర్యలు చేపడతామన్నారు.

ఘనంగా ఖరీఫ్ విత్తన దినోత్సవం

తిరుపతి సిటీ: తిరుపతిలోని ఎన్జీరంగా వర్సిటీ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం ఖరీఫ్ విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నూతన విత్తనాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. క్రాప్ విభాగాధిపతి డాక్టర్ కే జాన్ మాట్లాడుతూ వేరుశనగ, అపరాలు, నువ్వులు, చిరుధాన్యాలలో ఖరీఫ్ పంట కాలానికి అనువైన నూతన రకాలు, వాటి గుణగణాలు, విత్తన శుద్ధి, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు పలు రకాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కీటక శస్త్ర విభాగాధిపతి డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ భారతి, డాక్టర్ అమరావతి, శ్రీవల్లిదేవి, మహేశ్వరరెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఆర్‌ఐఓగా రాజశేఖర్‌రెడ్డి



జి.రాజశేఖర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ)గా జి.రాజశేఖర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. చంద్రగిరి బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డికి డీఐఈఓగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఆర్ఐఓగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన గురువారం తిరుపతిలోని ఆర్ఐఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా ఇంటర్ బోర్డు నిబంధనలను పాటించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల్లో తప్పనిసరిగా యోగా తరగతులు నిర్వహించాలని సూచించారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘ రాష్ట్ర పాధ్యక్షుడిగా లక్ష్మీపతి



ఎస్.లక్ష్మీపతి

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అటవీశాఖాధికారి ఎస్.లక్ష్మీపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో గురువారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఎన్నికలు నిర్వహించారు. జ్యుడిషల్ రామచంద్రరావు ఎన్నికల అధికారిగా, కమర్షియల్ ట్యాక్స్ అధికారి సత్యనారాయణ ఉప ఎన్నికల అధికారిగా, బుజంగరావు, ఆయుష్ అబ్జర్వర్లుగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా కేఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగసాయి, కోశాధికారిగా రామారావు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, సినిమాటోగ్రాఫ్ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ రాజశేఖర్ హాజరయ్యారు.

టెంపో వ్యాన్ ఢీ – అటెండర్ మృతి



మృతి చెందిన సాబ్‌జన్

దొరవారిసత్రం : టెంపో వ్యాన్ ఢీకొన్న ఘటనలో అటెండర్ మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి దొరవారిసత్రం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. డీవీ సత్రం బీసీ గురుకుల పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న సాబ్‌జన్(54) విధులు ముగించుకుని ఇంటికెళ్లేందుకు రహదారి దాటుతున్నాడు. అదే సమయంలో నాయుడుపేట నుంచి సూళ్లూరుపేట వైపు వెళ్లుతున్న టెంపో వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాబ్‌జన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

ముగ్గురు సెల్ ఫోన్ దొంగల అరెస్ట్

తిరుపతి క్రైమ్: నగరంలో ముగ్గురు సెల్‌ఫోన్ దొంగలను ఈస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని టీపీ ఏరియా వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మొబైల్ అమ్ముతున్నారని తెలుసుకున్న పోలీసులు చాకచక్యంగా వారిని అరెస్ట్ చేశారు. వీరు కర్ణాటక, అనంతపురం జిల్లాలకు చెందిన వారిగా గుర్తించారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విష్ణు నివాసం, శ్రీనివాసం వద్ద చోరీలు చేసినట్లుగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు.



శరీరం ముందు భాగంలో పర్యావరణానికి అనువైన వస్తువులను అతికించుకున్న దృశ్యం



వెనుక వైపున పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వస్తువులను అతికించుకున్న దృశ్యం

ఆకట్టుకున్న వినూత్న ప్రదర్శన

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎస్వీయూలో జరిగిన కార్యక్రమంలో ఓ వ్యక్తి విద్యార్థులను, అధ్యాపకులను, ఉద్యోగులను తన వినూత్న పదర్శనతో ఆకట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. తిరుపతికి చెందిన కోలా దామోదరం అనే సామాజిక కార్యకర్త ప్లాస్టిక్ ఫ్రీ యాక్టివిస్ట్‌గా స్థానికంగా గుర్తింపు పొందారు. ఆయన గురువారం వర్సిటీలో జరిగిన పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో పాల్గొని తన శరీరంపై డ్యూజ్ అండ్ డోంట్‌యూజ్ వస్తువులను అంటించుకుని వీక్షకులను చైతన్య పరిచే ప్రయత్నం చేశారు. తన శరీరం ముందుభాగంలో నేచురల్ వస్తువుల వినియోగం శ్రేయస్కరం అని తెలిపే వస్తువులను, శరీరం వెనుక భాగంలో ఉపయోగించకూడని ప్లాస్టిక్ వస్తువులను అతికించుకుని అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉద్యోగులు ఆయనతో సెల్ఫీ తీసుకునేందుకు ఎగబడ్డారు. ఆయనను వీసీ, రిజిస్ట్రార్, అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. – తిరుపతి సిటీ